714) మలహరి / బిలహరి

ప॥ విశ్వమెల్లనీ విరాడ్రూపము। శాశ్వతహరి నీశరణులము॥

చ॥ కన్నుల సూర్యుడు కమలాప్తుడు నీ-। పన్నినమోమున బ్రాహ్మణులు।
వున్నతివైశ్యులు వూరుపులందును। యెన్నగ శూద్రులు యిదె పాదములు॥

చ॥ యింద్రాదిదేవత లీశానబ్రహ్మము-। నీంద్రు లంగముల నెసగిరదే।
సాంద్రలోకములు జఠరంబున నవె। రుద్రతేజ మదె రోమముల॥

చ॥ కాలము గర్మము గైవల్యంబును। ఆలోను వెలియు నది నీవు।
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర। కోలుముందు నిను గొలిచితిమయ్య॥